ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

సోమవారం 10 నవంబరు 2025



ఆయిల్ సీడ్స్ లేఔట్‌లో అసంపూర్తిగా మిగిలి ఉన్న ఇళ్లు



ఆయిల్ సీడ్స్ లేఔట్‌లో అధ్వానంగా ఉన్న రోడ్లు



కంకర ఫ్యాక్టరీ లేఔట్‌లో రోడ్డు దుస్థితి

దారిలా... ఇళ్లు కట్టేదెలా...!

- ఊట చెరువులను తలపిస్తున్న జగనన్న కాలనీలు
- సెలయేళ్లలా దారులు
- నిలిచిపోయిన నిర్మాణాలు
- పట్టించుకోని అప్పటి వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలోనూ చిన్నచూపు

పీలేరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను వెలసిన తరువాత పీలేరు ప్రాంతంలోని జగనన్న కాలనీలు నీటి కుంటలను తలపిస్తుండగా, వాటిలోని పునాదులు నీట మునిగి లబ్ధిదారులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇక దారులైతే సెలయేళ్లలా మారి రాళ్ల రప్పలతో నిండిపోయి అడుగు తీసి అడుగు వేయలేనంత దుర్భరంగా మారిపోయాయి. నీట మునిగిన పునాదుల్లో ఇళ్ల నిర్మాణం ఎలా చేపట్టాలో తెలియక, ఒకవేళ నిర్మాణాలు చేపట్టినా భవిష్యత్తులో నీటి ప్రవాహానికి నిలబడతాయో లేదో తెలియని సందిగ్ధంలో లబ్ధిదారులు ఉన్నారు. జగనన్న కాలనీల కోసం స్థల కేటాయింపుల్లో అధికారులు, అధికార పార్టీ నేతలకు కొరవడిన ముందు చూపు కారణంగా ఇప్పుడు తాము మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందేమోనని లబ్ధిదారులు వాపోతున్నారు. పేదలకు వేల కొద్దీ ఇళ్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకున్న వైసీపీ ప్రభుత్వం కాలనీల్లో రోడ్ల నిర్మాణాన్ని పట్టించుకోకపోగా కూటమి ప్రభుత్వంలోనూ కేవలం ప్రతిపాదనలకే పరిమితమైపోయాయి.

కుంటలను తలపిస్తున్న కాలనీలు

గత వైసీపీ ప్రభుత్వంలో పీలేరులోని పేదలకు ప్రభుత్వం తిరుపతి మార్గంలోని కంకర ఫ్యాక్టరీ, ఆయిల్ సీడ్స్, కడప మార్గంలో ఏపీఐఐసీ-1 భూముల్లో మూడు ప్రధాన లేఔట్లు కేటాయించింది. కంకర ఫ్యాక్టరీ లేఔట్‌లో 1200, ఆయిల్ సీడ్స్ లేఔట్‌లో 700, ఏపీఐఐసీ-1లో 1200 ఇళ్లు కేటాయించారు. ఆ మూడు ప్రాంతాలు కూడా కొండలు, గుట్టలు, ఏటవాలు ప్రాంతాలు. ప్రభుత్వం కేటాయించిన చోట ఇళ్లు కట్టుకోకపోతే మరోమారు వస్తాయో లేదోనన్న అనుమానంతో చాలామంది లబ్ధిదారులు తమకు ఇష్టం లేకపోయినా అనేక వ్యయప్రయాసలకోర్చి నిర్మాణ పనులు చేపట్టారు. ఆ మూడు లేఔట్‌లలో కొంతమంది లబ్ధిదారులకు కేవలం పునాదులు నిర్మించుకోవడానికి దాదాపు రూ.2 లక్షలు వరకు ఖర్చయింది. అయితే లేఔట్‌లు వేసే సమయంలో అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు ఏటవాలు ప్రాంతాల్లో కూడా ప్లాట్లు కేటాయించారు. అది ఎంత అనర్థదాయకమో ఇది వరకే పలుమార్లు రుజువైనప్పటికీ మొంథా తుఫాను మరోమారు తెలియజేసింది. ఆ మూడు లేఔట్లు ప్రస్తుతం కుంటలను తలపిస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడ నీరు నిలిచి ఏది ప్లాటో, ఏది ఖాళీ స్థలమో తెలియని పరిస్థితి నెలకొంది. ఏటవాలు ప్రాంతాల్లో ఉన్న అనేక పునాదులు ప్రస్తుతం నీటమునిగాయి. కొన్ని పునాదులు నీటి ప్రవాహానికి కోసుకుపోయాయి. అటువంటి ప్రాంతాల్లోని ఇళ్లు నిలుస్తాయో లేదోనని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక రోడ్లు సెలయేళ్లను తలపిస్తున్నాయి. వర్షం దెబ్బకు ఆయా రోడ్లలో అడుగు పెడితే కాళ్లు సుమారు రెండు అడుగుల మేర దిగబడిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాకనైనా పరిస్థితిలో మార్పు వస్తుందనుకుంటే అది కూడా అడియాసగానే మిగిలిపోయింది. పీలేరు పరిధిలోని కాలనీల్లో రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామని 2024 జూన్‌లో అధికారులు ప్రకటించినప్పటికీ ఇతవరకు ఒక్క రోడ్డు కూడా నిర్మాణం జరగలేదు. ప్రస్తుతం కాలనీల్లో నెలకొన్న తాజా పరిస్థితులను రెండు రోజుల క్రితం హౌసింగ్ శాఖ డీఈ రమణయ్య తమ సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ప్రతిపాదనలకే పరిమితమైన రోడ్లు

జగనన్న కాలీల్లో అంతర్గత రోడ్లు నిర్మిస్తామని పలుమార్లు హామీ ఇచ్చిన వైసీపీ ప్రజాప్రతినిధులు వాటి గురించి పట్టించుకోలేదు. దీంతో అప్పట్లో చాలామంది లబ్ధిదారులు తమ గృహ నిర్మాణాలను అర్ధంతరంగా ఆపేశారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తరువాతనైనా కాలనీల రోడ్లకు మోక్షం కలుగుతుందేమోనని అందరూ ఆశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక అధికారులు పీలేరు మండలంలోని లేఔట్లలో రోడ్ల నిర్మాణం కోసం దాదాపు రూ.7 కోట్లు అవసరమంటూ ప్రతిపాదనలు సైతం పంపారు. కానీ ఎందుకనో ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు.

పీలేరు నియోజకవర్గంలో మంజూరైన ఇళ్ల వివరాలు...

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి
పీలేరు	4716	2055
వాల్మీకిపురం	1839	1413
కలికిరి	1627	1096
కలకడ	1027	807
గుర్రంకొండ	914	744
కేవీపల్లె	1323	1079
మొత్తం	11,446	7194



కంకర ఫ్యాక్టరీ లేఔట్‌లో పునాదులకే పరిమితమైన ఇళ్ల నిర్మాణాలు

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



పీలేరు పరిధిలోని కాలనీల్లో రోడ్ల కోసం రూ.7 కోట్ల నిధులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే రోడ్ల నిర్మాణం చేపడతాం. జిల్లా ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి మరోమారు నివేదిక అందజేస్తాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

- రమణయ్య, డీఈ, హౌసింగ్ శాఖ, పీలేరు

రెడ్డెమ్మ తల్లికి విశేష పూజలు



అమ్మవారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మ అమ్మవారు

గుర్రంకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీ రెడ్డెమ్మతల్లి దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళా భక్తులు సంతానం కోసం ఆకు పసరు తాగి అమ్మవారి చెంత ఒరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మొక్కు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో చైర్మన్ రాజన్ననాయుడు, ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతులు వెంటనే కల్పించాలి

- ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరాజు

రాయచోటి టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పదోన్నతులు వెంటనే కల్పించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు తెలిపారు. ఆదివారం రాయచోటి పట్టణం పరిధిలోని అర్చనా విద్యాసంస్థల్లో ఎన్‌టీఏ రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల పండితులకు పాఠశాల సహాయకులుగా పదోన్నతులు కల్పించిన దృష్ట్యా ప్రస్తుతం మిగిలి ఉన్న అన్ని లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులను సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ద్వారా భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సమావేశం ఆమోదించిన తీర్మానాల్లో ప్రధానంగా డీఎస్సీ-2023 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ (ఓపీఎస్) వర్తింపజేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని, 12వ వేతన కమీషన్‌ను నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఏకీకృత సర్వీస్ రూల్స్ అన్ని యాజమాన్యాలకు వర్తింపజేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, అర్హత గల ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ (తెలుగు, హిందీ, ఉర్దూ) పదోన్నతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు కలెక్టర్ ఆధ్వర్యంలో వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావే శంలో కేజీబీవీ డైరెక్టర్ దేవానంద్‌రెడ్డి, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎం.రెడ్డిరమేశ్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనిగల హైమారావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జె.శ్రీనివాస్, రాష్ట్ర అసోషియేట్ ప్రెసిడెంట్ నడిపినేని వెంకట్రావు, అర్చనా విద్యాసంస్థల అధినేత మదన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర స్థాయి బాధ్యులు పాల్గొన్నారు.

విచారణాధికారిగా అడిషనల్ ఎస్పీ

కడప, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకా కుమార్తె, అల్లుడిపై తప్పుడు కేసు పెట్టించిన అధికారులపై నమోదైన కేసుకు విచారణ అధికారిగా కడప అడిషనల్ ఎస్పీ ప్రకాష్‌బాబును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆదివారం ఆదేశాలు జారీ అయ్యాయి. మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్, సునీత, రాజశేఖర్‌రెడ్డిలు తనను బెదిరిస్తున్నారని, ఒత్తిడి తెస్తున్నారని, పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు అప్పట్లో వారి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఆ కేసు తప్పుడు కేసు అని కోర్టు క్వాష్ చేసింది. కానీ గత నెల 22న కుళాయప్ప అనే వ్యక్తి కర్నూలు పట్టణంలో డీజీపీకి తప్పుడు కేసు విషయమై విచారించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. దీంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి పులివెందులకు బదిలీ చేశారు. ఈ కేసులో రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ రాజేశ్వరరెడ్డి, ప్రస్తు తం రాజుపాలెంలో ఏఎస్ఐగా పనిచేస్తున్న రామకృష్ణారెడ్డిలపై కేసు నమోదైంది. రాజేశ్వరరెడ్డి అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు చేపడుతూ పదవీ విరమణ చేశారు. దీంతో కడప అడిషనల్ ఎస్పీ ప్రకాష్‌బాబును విచారణ అధికారిగా నియమించారు. ఆ కేసుకు సంబంధించి ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో విచారణ సాగనుంది. త్వరలోనే రాజేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డిలను అడిషనల్ ఎస్పీ ప్రకాష్‌బాబు బృందం విచారించనుంది.


రాజకీయాల్లోను.. రాజసంలోను ముందుండాలి

- క్షత్రియ సంఘ వన భోజన సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి
- ప్రత్యేక హోమాలు, పూజలు



క్షత్రియ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాల్లోను.. రాజసంలోను క్షత్రియులు అన్ని రంగాల్లో ముందుండాలని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్‌మోహన్‌రాజు పిలుపునిచ్చారు. రాజంపేట మండలం పుల పత్తూరు సమీపంలోని చెయ్యేరు నది ఒడ్డున ఆదివారం జరిగిన క్షత్రియ కార్తీక వనభోజన ఆత్మీయ సమావేశానికి భారీ ఎత్తున క్షత్రియులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చమర్తి మాట్లాడుతూ క్షత్రియులు పరస్పర క్షేమ సమాచారాలతో కులాలకతీతంగా అందరినీ ఆదరిస్తూ ముందుకు సాగాలని, ఒకరి కష్టంలో మరొకరు పాలు పంచుకోవాలన్నారు. కార్యక్రమానికి పెద్దఎత్తున క్షత్రియులు హాజరు కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కనకరాజు సూరి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాప్ రాజు, జనసేన నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు, క్షత్రియ సంఘ నాయకులు కొండూరు శరత్‌కుమార్‌రాజు, డాక్టర్ బాలరాజు, శివరాజు, డాక్టర్ చమర్తి చక్రధర్‌రాజు తదితరులు హాజరయ్యారు. సమావేశంలో రాజంపేట, రైల్వేకోడూరు, కడప, చిత్తూరు తదితర ప్రాంతాల నుంచి క్షత్రియులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన క్షత్రియులకు విందు భోజనాన్ని పెద్దఎత్తున ఏర్పాటు చేశారు.



కార్తీక వనభోజనంలో క్షత్రియులు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు | దక్షిణ భూకైలాసం.. బాలప్ప కోన 7

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- 12న చిన్నమండెంకు రాక



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కో-ఆర్డినేటర్ వెంకట్రమణ, కలెక్టర్‌నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తదితరులు

చిన్నమండెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 12వ తేదీ చిన్నమండెం మండలానికి రానున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం మొత్తం పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి హెలిప్యాడ్, సభా ప్రాంగణాలను ఉన్నతాధికారులు పరిశీలిస్తూ తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి పర్యటనల కో-ఆర్డినేటర్ వెంకట్రమణ, కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మంత్రి మండిపల్లి తమ్ముడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డితో కలిసి హెలిప్యాడ్, భద్రతా అంశాలపై చర్చించారు. అలాగే ట్రాఫిక్‌కు సంబంధించిన అంశాలు, భోజన వసతులు సభా ప్రాంగణాలకు ఎంత దూరంలో ఉండాలి అన్న అంశాల గురించి జిల్లా అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. హెలిప్యాడ్ దగ్గర కార్యకర్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశమై వారితో చర్చించనున్నారు. అనంతరం హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనుక ఉన్న నూతన గృహాలను సీఎం చేతుల మీదుగా ప్రారంభించిన అనంతరం కడప-బెంగళూరు జాతీయ రహదారి ఆనుకుని ఉన్న దేవగుడిపల్లి బాపూజీనగర్ కాలనీ మధ్యలో బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. అలాగే అక్కడ పీ4కు సంబంధించిన వారి గురించి ప్రకటిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి తిరిగి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని తిరుగు ప్రయాణమవుతారు. ఈ ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం నిర్విరామంగా పర్యవేక్షిస్తూ అన్ని శాఖల అనుసంధానంతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యమంత్రి పర్యటనల ఏర్పాట్లలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి, రాజంపేట సబ్ కలెక్టర్ భావన, అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, ఎస్‌బీ సీఐ రాజారమేశ్, వివిధ శాఖల అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయం

- అపస్ రాష్ట్ర అధ్యక్షుడు శవాన్నగారి బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శవాన్నగారి బాలాజీ


పీలేరు రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) రాష్ట్ర అధ్యక్షుడు శవాన్నగారి బాలాజీ తెలిపారు. ఆదివారం అన్నమయ్య జిల్లా పీలేరు టీటీడీ కల్యాణ మండపంలో అపస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ఉపాధ్యాయుల పదోన్నతుల్లో అపస్ ముందుండి సమస్యను పరిష్కరించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పీఆర్‌సీ గడువు ముగిసి ఏళ్లు గడచిపోతున్నా ఇంకా ఆలస్యం చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి సమంజసం కాదన్నారు. పీఆర్‌సీ కమిటీ ప్రకటించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలని కోరారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను ఈ ప్రభుత్వం కొనసాగిస్తే ఉద్యోగ ఉపాధ్యాయుల్లో ప్రభుత్వంపై నమ్మకం సన్నగిల్లుతుందని తెలిపారు. సీపీఎస్ రద్దు చేసే వరకూ తమ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులను విద్యాబోధనకే పరిమితం చేయాలని, అనవసర యాప్‌లతో ఉపాధ్యాయుల విలువైన సమయం వృథా అవుతోందని, ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయులపై ఉన్న యాప్‌ల భారాన్ని తగ్గించాలని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ వీరాంజనేయప్రసాద్, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మధుమతి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పచ్చార్ల సుధాకర్, జిల్లా నాయకులు వేణుగోపాల్, శివశంకర్, దివాకర్, ఓబుల్‌రెడ్డి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భూకైలాసం.. బాలప్ప కోన



బాలప్పకోనలో కొలువైన పరమేశ్వరుడు, పార్వతీదేవి





పడవ ఆకారంలో ఉన్న బాలప్పకోన సముదాయం



సహజసిద్ధంగా దూకుతున్న గంగమ్మ

కొండాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రకృతి మనకు దేవుడిచ్చిన వరం. అలాంటి ప్రకృతిలో సాక్షాత్తు పరమేశ్వరుడు కొలువై ఉంటే ఇంకేముంది. తనివి తీరా చూడాలనిపిస్తుంది. ప్రకృతి అందాలతో పాటు దైవానుభూతిని కలిగించే విశిష్టమైన క్షేత్రం బాలప్పకోన. కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి ఉత్తర దిక్కున సుమారు 20కిలోమీటర్ల దూరంలో ఎర్రమలకొండల్లో బాలప్పకోన ఉంది. పడవ ఆకారంలో కొండ గుహల్లో పార్వతీపరమేశ్వరులు కొలువై దక్షిణ భూకైలాసంగా విరాజిల్లుతోంది. రాయలసీమ రత్న గర్భంలోని గొప్ప శైవక్షేత్రాల్లో బాలప్ప కోన (బాల మల్లేశ్వర కోన) ఒకటి. పరమేశ్వరుడు పార్వతీ సమేతంగా గంగను వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చినట్లు పురాణకథలు చెబుతున్నాయి. అందుకే ఈ క్షేత్రాన్ని దక్షిణభూకైలాసం అని పిలుస్తుంటారు. ఈ క్షేత్రంలో ఎప్పటి నుంచో మునీశ్వరులు నివాసమున్నట్లు అనేక కథలు ఉన్నాయి.

బాలప్ప కోన స్థలపురాణం

ఈ క్షేత్రం ఉన్న కొండలో పడవ ఆకారంలో గుహలున్నాయి. పడవలా ఉన్న పైభాగం నుంచి నీరు గలగల ప్రవహిస్తూ ఉంటుంది. లోయకు ఇరువైపులా ప్రకృతి సౌందర్యం రమణీయంగా ఉంటుంది. స్థలపురాణం ప్రకారం ఈ కొండకు పడవ ఆకారం రావడానికి కారణం.. భద్రుడు అనే మునీశ్వరుడు ఇక్కడ తపస్సు చేసుకుంటుండగా అతన్ని పరీక్షించడానికి శివపార్వతులు పదితలల పామును సృష్టించి విషాన్ని చిమ్ముతూ భద్రుని మింగేలా చేశారు. అపార శివభక్తుడైన భద్రుడు ఆ పాము భయంకర రూపాన్ని చూసినప్పటికీ, భయపడక శివనామస్మరణ చేయడంతో ఆ సర్పం మాయమై శివపార్వతులు దర్శనం ఇచ్చి భద్రునికి మోక్షాన్ని ప్రసాదించారని, అప్పటి నుండి భద్రుని పేర ఈ కొండ ప్రాంతం బాలప్పకోనగా విరాజిల్లుతోందని పురాణ గాథలు చెబుతున్నాయి.

బాలప్పకోన చేరుకోవాలంటే..

బాలప్పకోనకు తాళ్లప్రొద్దుటూరు వైపు నుంచి వచ్చేవారు బొందలదిన్నె, సంకేపల్లె మీదుగా, అలాగే తాడిపత్రి వైపు నుంచి వచ్చే వారు పెన్నా సిమెంటు ఫ్యాక్టరీ మీదుగా బాలప్పకోన చేరుకోవచ్చు.

ప్రకృతి రమణీయంగా బాలప్ప కోన

అతి పురాతనమైన శివలింగం బాలప్పకోనలో కొలువై ఉంది. ప్రకృతి రమణీయంగా ఉన్న ఈ కొండల్లో గతంలో సుమారు 70 అడుగుల శివలింగం ఉండేదని స్థానికుల కథనం. గతంలో మునులు నిచ్చెనలు వేసుకొని పూజలు చేసేవారని, కాలక్రమేణా శివలింగం పూడిపోయి ప్రస్తుతం 5 అడుగులకు చేరుకుందని భక్తులు చెబుతున్నారు. ప్రకృతిసిద్ధంగా కొలువుదీరిన పరమేశ్వరుని దర్శించుకోవడానికి కార్తీకమాసంతో పాటు సోమవారం, వివిధ పర్వదినాల్లో అనేకమంది భక్తులు తరలివస్తారు. ముఖ్యంగా కార్తీకమాసంలో అఖండదీపారాదన చేస్తారు.



బాలప్పకోనలోని కోనేరు

ఊరేగింపును ఉత్సాహంగా జరుపుకోండి

● రెచ్చగొట్టే పనులకు దిగొద్దు : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

చెన్నూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా చెన్నూరు నాగేశ్వర ఆలయం నుంచి నిర్వహించే ఊరేగింపును ఉత్సాహంగా నిర్వహించుకోవాలని, ఎలాంటి రెచ్చగొట్టే పనులకు దిగొద్దని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అన్నారు. గత కొద్దిరోజులుగా ఈ ఊరేగింపు విషయమై రెండు వర్గాల మధ్య వాదోపవాదాలు జరుగుతున్న విషయంపై ఎస్పీ ఆదివారం సాయంత్రం చెన్నూరు రెవెన్యూ కార్యాలయానికి వచ్చారు. అక్కడ జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి ఇరువర్గాలతో మాట్లాడారు. పండు గలు, ఊరేగింపులు అన్ని మతాల్లో ఉంటాయని, అందరూ ఒకరికొకరు సహక రించుకోవాలన్నారు. ఏ రూటు ప్రకారం చెబుతామో అదే రూటులో ఎలాంటి శబ్ద కాలుష్యమైన డ్రమ్స్ ఏర్పాటు చేయవద్దని, కేవలం మంగళవాయిద్యాలతో నిర్వహించుకోవాలన్నారు. అదే సమయంలో ఊరేగింపునకు ఆటంకాలు కలి గించవద్దని తెలిపారు. పోలీసుపరంగా ఎలాంటి సంఘర్షణలు, సమస్యలు తలెత్తకుండా భద్రత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రకాశ్ బాబు, ఆర్డీవో జాన్‌ఇర్విన్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, బాలస్వామిరెడ్డి, సుధాకర్, అబ్దుల్‌కరీం, సీఐలు కృష్ణారెడ్డి, రోషన్, ఈదురుబాషా, తహసీల్దార్ సరస్వతి, ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

గాలివీడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎగువ గొట్టివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.శివ, ఎస్.సనాకౌసర్ ఎంపికైనట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కడప మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో అండర్-17 పోటీల్లో ఈ విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదాశివారెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించి రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనపర్చాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు...



ఎంపికైన గౌతమి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాండ్రపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గౌతమి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ రెడ్డయ్య తెలిపారు. ఈ నెల 8న కడప మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు సిద్దేశ్వర, ఉపాధ్యాయులు చక్రపాణి హర్షం వ్యక్తం చేశారు.

13 లోగా దరఖాస్తు చేసుకోండి

సీకేదిన్నె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఉపరవాణా కమిషనర్ ఎం.వీరరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నైపుణ్యంతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థికసాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడమే దీని ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ చొప్పున మంజూరు చేసేందుకు నిర్ణయించడమైందన్నారు. ఈనెల 13 సాయంత్రం అయిదు గంటలలోపు ఆసక్తిగల అభ్యర్థులు డీపీఆర్ కాపీలను, ఇతర అటాచ్‌మెంట్లను ఉపరవాణా కార్యాలయం వైఎస్ఆర్ కడపజిల్లా ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందుకు కావాల్సిన అర్హతలు ఆసక్తిగల సంస్థ ఎంజీవో, ట్రస్ట్ , కోఆపరేటివ్ సొసైటీ, తయారీదారుడు, ఫార్మ్‌అయి ఉండాలన్నారు. ఎన్జీవో అయితే తప్పనిసరిగా దర్పం పోర్టల్‌లో రిజిస్టర్ అయి ఉండాలన్నారు. ఈ సంస్థ గత మూడు సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్స్ టర్నోవర్ సర్టిఫికెట్లు అందించాలన్నారు. ఇటువంటి సంస్థకు సొంతంగా లేదా కనీసం పది సంవత్సరాల లీజు కలిగిన రెండు ఎకరాల స్థలం, సిమ్యులేటర్, ట్రైనింగ్ వాహనాలు, వర్క్‌షాపు, రెండు క్లాస్‌రూమ్స్, ఇంటర్నెట్, తదితర సదుపాయాలు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు రవాణా శాఖ వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు.

ద్విచక్రవాహనం ఢీ... ఒకరి మృతి



మృతి చెందిన కొండయ్యనాయుడు

రాయచోటి-నేతాజీసర్కిల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి సంబేపల్లె మండలం మొటుకువాండ్లపల్లె సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అతని భార్యకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... సుండుపల్లె మండలం రామవాండ్లపల్లెకు చెందిన కొండయ్య నాయుడు (51) రత్నమ్మ దంపతులు ద్విచక్రవాహనంలో అన్నప్పగారిపల్లెకు వెళుతుండగా మొతుకువాండ్లపల్లె క్రాస్ వద్ద పీలేరు వైపు వెళుతున్న కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన కొండయ్యనాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, రత్నమ్మ తీవ్రంగా గాయపడింది. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన మహిళను తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలియజేశారు.

మట్కా బీటరు అరెస్టు - నగదు స్వాధీనం



మట్కా నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్ఐ

ప్రొద్దుటూరురూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద వడ్ల లక్ష్మీనారాయణ అనే మట్కా నిర్వాహకున్ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.8,250 నగదు, మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ నాగభూషణం తెలిపారు. పోలీసులవివరాల మేరకు లక్ష్మీనారాయణ గత కొంత కాలంగా టీ బంకు నిర్వహణ ముసుగులో మట్కా నిర్వహిస్తుండగా సమాచారం అందడంతో దాడి చేసి అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఇతనితోపాటు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని మట్కా బీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మట్కా వలన కుటుంబాల ఆర్థిక నాశనం గురించి ఈ జూదం వలన కలిగే నష్టాలను వివరిస్తూ మరోసారి మట్కా ఆడుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి



ఎర్రగుంట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వృద్ధుడు ఆదివారం మృతి చెందినట్లు ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు. గత నెల 13వ తేదీన ముద్దనూరు రోడ్డులోని సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో వున్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

పాత పింఛన్‌ను పునరుద్ధరణ చేయాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ పద్ధతిని పునరుద్ధరించాలని ఏపీ కాంట్రిబ్యూటరీ పింఛన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకట జనార్దనరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లా నూతన కార్యవర్గ ఎంపికలో అంకిరెడ్డిపల్లె మదన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షుడిగా, జి.హరేంద్ర ప్రధాన కార్యదర్శిగా, నర్రా రజనీకాంత్ ఆర్థిక కార్యదర్శిగా, మార్పూరి ప్రభావతి మహిళా అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో వెంకట జనార్దనరెడ్డి, సీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి



మృతి చెందిన యువకులు

మైదుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవీ సత్రం కూడలి సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. యువకులు కడప పట్టణం బెల్లంమండి వీధికి చెందిన సాయిసంజయ్(22), చిన్నచౌకు అశోక్‌నగర్‌కు చెందిన సంతోష్(23)లుగా గుర్తించారు. సాయి బంగారుషాపులో పనిచేస్తుండగా సంతోష్ కడప అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదువుతున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



61 పరుగులు చేసిన తాహీర్ (కడప), 102 పరుగులు చేసిన మణిదీప్ (చిత్తూరు)

కడప స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం డ్రాగా ముగిశాయి. నగర శివారులోని రిమ్స్ సమీపంలో ఉన్న వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 66.2 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 54 పరుగులు చేసింది. కాగా 54 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండవ రోజైన ఆదివారం తిరిగి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 71.5 ఓవర్లలో మొత్తం 147 పరుగులకే చేతులెత్తేసింది. దీంతో కడప జట్టుకు 51 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. బౌలింగ్ విభాగంలో కడపకు చెందిన బౌలర్ భానువర్షిత్‌రెడ్డి 6 వికెట్లు సాధించి కట్టడి చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో కడప జట్టు ఆట ముగిసే సమయానికి 46 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. ఇందులో తాహీర్ 61 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కేవోఆర్ఎం మైదానంలో

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 28.3 ఓవర్లలో 63 పరుగులకు కుప్పకూలిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు సైతం 34.3 ఓవర్లలోనే కేవలం 56 పరుగులు చేసి ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 78 పరుగులతో ఆదివారం తిరిగి రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు 81.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 289 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో మునిదీప్ 102 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో చిత్తూరు జట్టు రెండు ఇన్నింగ్స్‌లకు గాను 296 పరుగులు సాధించింది. కాగా ఇందుకు ప్రతిగా రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 32 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. ఇందులో మోక్షజ్ఞరెడ్డి 63 పరుగులు చేయగా మరో బ్యాటర్ షాకిత్ 60 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో నగరేశ్వరస్వామికి రుద్రాభిషేకం

● పూజల్లో పాల్గొన్న హంపీ విరూపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామిజీ



పార్వతీసమేత నగరేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న విద్యారణ్య భారతి స్వామిజీ, కుంకుమార్చన చేస్తున్న ఆర్యవైశ్య సువాసినులు

ప్రొద్దుటూరుటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవిని సర్కిల్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఉద్యానవనంలో ఆరుద్రా నక్షత్రం సందర్భంగా ఆదివారం నగరేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం నిర్వహించారు. నూతనంగా చర ప్రతిష్ఠ చేసిన నగరేశ్వరస్వామి స్వరూప స్ఫటికలింగానికి, పార్వతీ సమేత నగరేశ్వరస్వామి విగ్రహాలకు శ్రీ జగద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య మహాసంస్థానాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామిజీ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకకల్యాణార్థం గణపతి పూజ, స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిజీ మహాశివుని గొప్పతనాన్ని, కార్తీకమాస ప్రాముఖ్యతను, దీప విశిష్ఠతను గురించి భక్తులకు వివరించారు. 102 మంది ఆర్యవైశ్య సుహాసినులు సామూహికంగా పార్వతీమాతకు కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్ రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రన్న.. రైతుల పక్షపాతి : పుత్తా నరసింహారెడ్డి



నీటిని వదులుతున్న పుత్తా నరసింహారెడ్డి

వల్లూరు నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతు లేనిదే రాజ్యమే లేదనే విశ్వాసంతో సీఎం చంద్రబాబునాయుడు రైతుల పురోగతికి వెన్నుదన్నుగా ఉంటూ రైతు పక్షపాతిగా ఖ్యాతి గాంచారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని అంబవరం చెరువు నుంచి దాదాపు 270 ఎకరాలకు సంబంధించి ఆయకట్టు రైతులకు నీటిని వదిలి మాట్లాడారు. రైతుల కోసం నిరంతరం పనిచేస్తున్నామని, ఎక్కడా రాజీ పడకుండా రైతన్నల అభివృద్ధి కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలను ఏర్పాటు చేశారని తెలిపారు. గతంలో కూడా ఉల్లి రైతులకు మేలు చేసిన ఘనత చంద్రన్నకే దక్కిందన్నారు. ప్రధానంగా అంబవరం ఆయకట్టు కింద ఉన్న రైతులు చెరువు నీటి ద్వారా పొలాలను పండించుకుని బాగుండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కృతనిశ్చయంతో కాల్వను ఏర్పాటు చేసిందని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి వాటిని సంబంధిత అధికారులకు చేరవేశారు. కార్యక్రమంలో అంబవరం చెరువు అధ్యక్షుడు ఎం.శివారెడ్డి, డీఈ జగదీశ్వర్‌రెడ్డి, వీఏసీఎస్ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి, చంద్రారెడ్డి, పాపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, సుధా మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

● కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, సరస్వతినగర్‌కు చెందిన ఇరువురు ఘర్షణ పడడంతో తాలుకా పోలీసులు ఒకరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ కళావెంకటరమణ పేర్కొన్నారు. పోలీసుల వివరాలిలా.. మండలంలోని సరస్వతీనగర్ వాసి రామూర్తి నాయక్కు, అదే ప్రాంతానికి చెందిన భవానీతో పాత గొడవలు ఉండేవి. అయితే అప్పట్లో రాజీపడి రూ.40 వేలు రామ్మూర్తినాయక్ చెల్లించారు. ఆదివారం సాయంత్రం రోడ్డుపై భవానీ, అతని భార్య నడుచుకుంటూ వెళుతుండగా రామ్మూర్తినాయక్‌కు ఎదురుగా వచ్చి దూర్భాషలాడారు. ఈ మేరకు భవానీపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న లక్ష్మిప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వరరావు

రాయచోటి - నేతాజీ సర్కిల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చిన్నమండెం మండలంలో చేస్తున్న ఏర్పాట్లను టీడీపీ నాయకుడు లక్ష్మిప్రసాద్‌రెడ్డి ,పెందుర్తి వెంకటేశరావు పరిశీలించినట్లు రాష్ట్ర పాలఏకరి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్‌నాయుడు తెలిపారు. చంద్ర బాబు పర్యటన విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేస్తామని, అందుకు బీసీలంతా సహకరించాలని కోరారు.

గంగమ్మకు పూజలు

లక్కిరెడ్డిపల్లె,నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం గ్రామంలో ఆదివారం గంగమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలు వెలిగించారు.పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదానం

రామాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పోలూరు సురేశ్‌నాయుడు, భార్య శివకళ పుట్టినరోజు సందర్భంగా రామాపురం మండలం బండపల్లి పంచాయతీ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం చేసినట్లు లయన్ పసుపులేటి శ్యామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు లయన్ శివారెడ్డి, కార్యదర్శి లయన్ షేక్. ఇందాద్ అహమ్మద్, దాత కుటుంబ సభ్యులు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు

గాలివీడు, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 30 వరకు అయ్యప్ప భక్తులకు మధ్యాహ్నం భిక్ష ఏర్పాటు చేసినట్లు సేవాభావం సంస్థ అధ్యక్షుడు పీ. ఆర్య శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలం కుమ్మరపల్లి వద్ద పెద్దచెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా నవంబర్ 3న ప్రారంభించి ఈ నెల చివరి వరకు కొనసాగిస్తామని తెలిపారు.

నాగారపమ్మకు బోనాలు

సుండుపల్లె, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లి సమీపంలోని నాగారపమ్మ ఆలయంలో ఆదివారం పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టు వస్త్రాలను సమర్పించారు. భక్తులు టెంకాయలు కొట్టి బోనాలు సమర్పించారు.

కార్తీక పూజలకు శివాలయాలు ముస్తాబు

పెనగలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని జెట్టివారిపల్లె నాగలింగేశ్వరస్వామి, తూర్పుపల్లెలోని బోడమల్లేశ్వరస్వామి దేవాలయాల్లో పూజల కు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జెట్టివారిపల్లెలో నాగలింగేశ్వర స్వామికి అభిషేకాలు, ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు అన్నదానం, దేవాలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కోమంతరాజపురం మాజీ సర్పంచ్ కురముట్ల వెంకటసుబ్బయ్య తెలిపారు. తూర్పుపల్లెలోని బోడమల్లేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ధర్మకర్త కోడూరు వెంకట సుబ్బయ్య తెలిపారు. భక్తులు గంగా, గౌరి, శివపార్వతులను దర్శించుకుని పునీతులు కావాలని కోరారు.

మూడు పూటలా అన్న ప్రసాదం..

అందని ద్రాక్ష!

- నిధులు మంజూరైనా ముందుకు సాగని పనులు
- ఇబ్బందుల్లో ఒంటిమిట్ట కోదండరాముడి భక్తులు



టీటీడీ అన్నప్రసాద కేంద్రం

ఒంటిమిట్ట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెండో అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండరామస్వామి భక్తులకు మూడు పూటలా అన్న ప్రసాదం అందజేయాలని ముఖ్య మంత్రి ఇచ్చిన ఆదేశాలు నీరుగారిపోతున్నాయి. టీటీడీ అధికారులు కేవలం మధ్యాహ్నం మాత్రమే అన్న ప్రసాదం పంపిణీ చేసుండడంతో రాత్రివేళల్లో ఇక్కడికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయం విలీనం కావడంతో టీటీడీ అధికారులు ఒంటిమిట్ట కోదండరామాలయ అభివృద్ధికి 100 కోట్ల రూపాయలను కేటాయించారు. దీంతో ప్రతిరోజు మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. మూడేళ్ల నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ మధ్య కాలంలో ఆలయానికి ప్రత్యేక గుర్తింపు రావడంతో భక్తుల తాకిడి అధికమైంది. ఈ యేడాది ఏప్రిల్‌లో జరిగిన కోదండరాముని కల్యాణోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రామ భక్తులకు మూడు పూటల అన్న ప్రసాదాలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీంతో టీటీడీ అధికారులు అందుకు అవసరమయ్యే ఏర్పాట్లు చేసేందుకు రూ. 4.30 కోట్లను మంజూరు చేస్తున్నట్లు గత జూలైలో టీటీడీ పాలకవర్గ సమావేశంలో టీటీడీ చైర్మన్ డీఆర్ నాయుడు ప్రకటించారు. దీంతో ఈ ఏడాది అక్టోబరు 1 నుంచి మూడు పూటలా అన్న ప్రసాదాలను పంపిణీ చేయనున్నట్లు అప్పట్లో అధికారులు ప్రకటించారు. అన్న ప్రసాదాల ఎ తయారీకి సంబంధించి స్థలాన్ని కూడా అధికారులు పరిశీలించి పనులు కూడా ప్రారంభించారు. ఆ తర్వాత ఎందుకో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో భక్తుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అన్న ప్రసాదాల పంపిణీకి తగిన చర్యలు తీసుకోవాలని రామ భక్తులు కోరుతున్నారు.



అన్నదాన కేంద్రం ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలం

మూడు పూటలాఅన్న ప్రసాదాలు అందాలి



కోదండరాముని దర్శనానికి విచ్చేసే భక్తులకు మూడు పూటల అన్న ప్రసాదాలను పంపిణీ చేయాలి. ద ఒంటిమిట్టలో ఉన్న ప్రైవేటు అన్నదాన సత్రాలను నియంత్రించాలి. దీనిద్వారా ఆలయ అన్నదాన కేంద్రానికి విరాళాలు అధిక సంఖ్యలో వచ్చే అవకాశాలున్నాయి.

- మధుమూర్తి, పురోహితుడు, ఒంటిమిట్ట.

భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు



ఒంటిమిట్టకు విచ్చేసే భక్తులు రాత్రి సమయాల్లో అన్న ప్రసాదాలు లభించక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో రాత్రివేళల్లో భోజన వసతి లేకపోవడంతో భక్తులకు అవస్థలు తప్పడంలేదు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి త్వరలో మూడు పూటలా అన్న ప్రసాదాలు భక్తులకు అందజేయాలి.

- భాస్కర్‌రెడ్డి, ఒంటిమిట్ట

'సమాజ నిర్మాతలు గైడ్ కెప్టెన్లు'



మాట్లాడుతున్న దేవానంద్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గైడ్ కెప్టెన్లు భవిష్యత్ సమాజ నిర్మాతలని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు రాష్ట్ర సంచాలకులు డీ. దేవానందరెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో ఈ నెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు 7 రోజుల పాటు నిర్వహించిన గైడ్ కెప్టెన్ల బేసిక్ శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం (స్కౌట్స్ అండ్ గైడ్స్) తోడ్పడుతుందన్నారు. బాలికల్లో సేవాభావం, క్రమశిక్షణ, ధైర్యం, సాహసం వంటి మానవీయ విలువలను పెంపొందించడంలో గైడ్ కెప్టెన్ల పాత్ర ఎనలేనిదన్నారు. వారు కేవలం శిక్షకులు మాత్రమే కాకుండా బాలికలకు ఆదర్శంగా నిలిచి జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రోత్సహించాలన్నారు. పీటీఎం మండలం కమ్మచెరువు హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని లలిత రూ.10 వేలు చెల్లించి స్కౌట్ జీవిత సభ్యురాలుగా చేరడం గొప్ప విషయం అన్నారు. ఆంధ్రప్రదేశ్ తరపున జాతీయ స్థాయిలో ప్రకృతి వైపరీత్యాలపై భువనేశ్వర్‌లో 21 రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో పాల్గొన్న వెంకట్రమణను అభినందించారు. అనంతరం గైడ్ కెప్టెన్‌లు దేవానందరెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లీడర్ ఆఫ్ ది కోర్స్ కస్తూరి సుధాకర్, జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, ఆపద మిత్ర నోడల్ ఆఫీసర్ గురునాథరెడ్డి, అడ్వాన్స్ గైడ్ కెప్టెన్ సుజాత, 57 మంది బేసిక్ గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు వెంకట్రమణ

రాయచోటిటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు టీ. వెంకట్రమణ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎన్జీవో హోంలో అన్నమయ్య జిల్లా ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డీఏ ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పెన్షనర్ల సంఘం రాయచోటి తాలూకా అధ్యక్షుడు చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ సంఘ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర సెక్రటరీ చిన్నరెడ్డెన్న మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన పీఎఫ్, కమ్యూటేషన్ గ్రాట్యుటీ, ఎన్‌కాష్‌మెంట్ ఆఫ్ ఎర్న్ లీవ్ వంటివి సకాలంలో మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాయచోటి తాలూకా సెక్రటరీ ఈశ్వరయ్య, సీనియర్ నాయకుడు విశ్వనాథరెడ్డి గుడిబండ శ్రీనివాసులు, రఘునాథరెడ్డి, రామయ్య, రాంమోహన్‌రెడ్డి, ఆరీఫ్, అల్లా బకష్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో చీకటి రోజులు

- కమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు



ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కమ్మ సంఘం నేతలు

సిద్దవటం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో చీకటి రోజులు గడిపామని కమ్మ సమాజం జిల్లా అధ్యక్షుడు పల్లనేని నాగేశ్వరరావు తెలిపారు. సిద్దవటంలోని బాల మహేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం కమ్మ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఉమ్మడి కడప జిల్లాలో ఉన్న కమ్మ నేతలు కలిసి కట్టుగా పని చేయాలని కార్తీక వన భోజనాలకు ఊహించని రీతిలో హాజరు కావడం ఐక్యతను చాటి చెప్పిందన్నారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో కమ్మ సామాజిక వర్గంపై దాడులు చేశారని, ఆడబిడ్డలపై కేసులు బనాయించి ఇబ్బంది పెట్టారని, అలాంటివారికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

సిద్దవటం సింగిల్‌విండో అధ్యక్షుడు దారపునేని దశరథ నాయుడు మాట్లా డుతూ ఉమ్మడి కడపజిల్లాలో కమ్మ సామాజిక వర్గం బలమైన శక్తిగా ఉందన్నారు. మాజీ అధ్యక్షుడు కేవీఎస్ నాయుడు రాష్ట్రంలో కమ్మవారికి కూడా వారంలో ఒక్కరోజు కమ్మ వారంగా కేటాయించాలని విషయం ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ సామాజిక వర్గ నేతలు, రాయలసీమ ఉమ్మడి కడప జిల్లా నేతలు, స్థానిక సింగిల్‌విండో అధ్యక్షుడు దశరథ రామానాయుడు, దారపునేని రాఘవనాయుడు, దారపునేని ధనమ్మ, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనభోజనాలు



కార్తీక వనభోజనం సందర్భంగా సమావేశమైన సంఘం పెద్దలు

చిన్నమండెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వండాడి గ్రామ పంచాయతీ గాండపల్లె దగ్గర ఆదివారం గాండ్ల కులస్తులు కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. రాబోయే రోజుల్లో రాయచోటిలో గాండ్ల సంక్షేమ భవనం ఏర్పాటుకు కృషి చేస్తామని సంఘ పెద్ద లు తెలిపారు. వచ్చే ఏడాది గాలివీడులో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేయ నున్నట్లు ప్రకటించారు. గాండ్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా తుమ్మల నాగేశ్వర రావును, ప్రధాన కార్యదర్శిగా నారు శ్రీధర్, కోశాధికారిగా బోధనపు ప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు సంఘం శాశ్వత ఈసీ సభ్యుడు మల్లూరు రెడ్డివరప్రసాద్ తెలిపారు.

విశ్రాంత ఎంఈవో దిలీప్‌కుమార్‌కు నివాళి

రాజంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విశ్రాంత ఎంఈవో దిలీప్‌కుమార్‌కు రాజంపేటలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. రాజంపేట ఎంఈవో కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు బి.వేణుగోపాల్, జిల్లా విశ్రాంత మలేరియా అధికారి, ఎన్జీవో సంఘ మాజీ అధ్యక్షుడు లావలూరి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సుమారు పదేళ్లుగా ఎంఈవోగా విద్యాభివృద్ధికి ఆయన కృషిని ప్రశంసించారు

భక్తిశ్రద్ధలతో ఆకాశదీపం

రైల్వేకోడూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ ఉంగరాల చిన్నా ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఆకాశ దీపం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు బోయలకుంట్ల పవన్‌కుమార్‌శర్మ, ధూర్జటి యోగి ఆకాశదీపం వెలిగించి పూజలు చేశారు. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఉర్దూ దినోత్సవాలు

రాయచోటిటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం అంజుమన్ తరఖి ఉర్దూ, సహారా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉర్దూ దినోత్సవాలు, సారే జహాసె అచ్ఛా.. హిందుస్థాన్ హమారా గేయ రచయిత అల్లామా మహమ్మద్ ఇక్బాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉర్దూ కవితలు, గేయాల పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ టీడీపీ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి వతన్‌నిస్సార్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో ఉర్దూ భాష కీలక భూమిక పోషించిందని, కవిత్వం, సాహిత్యం ప్రసంగాలతో ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదం ఎంతో మందిని స్వాతంత్ర సమరంలో ప్రాణాలు సైతం అర్పించేలా ప్రేరేపించిందని తెలిపారు. ఉర్దూ కేవలం ముస్లింల భాష కాదని ఇది భారతదేశంలో పుట్టి ఇక్కడే పెరిగి ఇక్కడే ప్రాచుర్యం పొందిందని తెలిపారు. అనంతరం పాత ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ రియాజుద్దీన్ మాట్లాడుతూ స్వచ్ఛంద సేవా సంస్థలు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. అనంతరం సహారా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి అఫ్జాజ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రెండవ అధికారిక భాషగా ఉన్న ఉర్దూకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజముద్రలో చోటు కల్పించాలని కోరుతూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం ఉర్దూ భాష అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న ఉర్దూ ఉపాధ్యాయులను సన్మానించారు. అంజుమన్ తరఖీ ఉర్దూ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి షహీమ్, మహమ్మద్ అలీ, సదా, ఆరీఫ్, నాసర్, నియాజ్, మన్సూర్, షఫీ, సహారా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సయ్యద్ అమీర్‌అలీ, కోశాధికారి జిలాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది రామదాసు

ఒంటిమిట్ట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్క రించుకోవచ్చునని సీనియర్ న్యాయవాది రామదాసు తెలిపారు. ఆదివారం మండలంలోని పెన్నపేరూరు గ్రామంలో చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లీగల్ సర్వీస్‌డే సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కోర్టు సిబ్బంది మధు, కోర్టు కానిస్టేబుల్ రాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మ్యాజిక్ ఉత్సవాలు



యూపీ రాయుడును సత్కరిస్తున్న నిర్వాహకులు

రాజంపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో ఏపీ మ్యాజిక్ అసోసియేషన్, అధ్యక్షుడు ఏవీ రావు, ప్రధాన కార్యదర్శి యూపీ రాయుడు తదితరుల ఆధ్వర్యంలో ఆదివారం 41వ మ్యాజిక్ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మ్యాజిషో నిర్వహించి అబ్బుర పరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మ్యాజిక్ షో చిన్నపిల్లల నుంచి వయసు మీరిన పెద్దల వరకు అలరించే ప్రధాన క్రీడ అన్నారు. రాజంపేటలో 41 ఏళ్లగా యూపీ రాయుడు మ్యాజిక్ షోను నిర్వహిస్తూ మంచి గుర్తింపు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా యూపీ రాయుడును కార్యనిర్వాహలు ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని రాజంపేట, కోడూరు నియోజకవర్గాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మూడు రోజుల పాటు కరెంటు నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట, కోడూరు, రేణిగుంట లైన్లపై మరమ్మతులు చేస్తుండడంతో 220 సబ్‌స్టేషన్ పరిధిలో కరెంటు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కోడూరులో కూడా 220కేవీ సబ్‌స్టేషన్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు.

క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

రాజంపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ కనకరాజు సూరిని ఆదివారం రాజంపేట జనసేనపార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పార్లమెంట్ నాయకుడు యల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కార్పొరేషన్ ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలను చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకులు షబ్బీర్ అహ్మద్, టీడీపీ నాయకులు అబూబకర్, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ప్రతాప్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ మండల కార్యవర్గం ఎంపిక



ఏపీయూఎస్ మండల నూతన కార్యవర్గం

రాయచోటి-నేతాజీ సర్కిల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన ఆదివారం సంబేపల్లె మండలం అపస్ కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు.సంబేపల్లె మండలం ఏపీయూఎస్ గౌరవాధ్యక్షు డుగా రెడ్డిశేఖర్, మండలాధ్యక్షుడుగా వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగభూషణ్‌రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌బాబు, ఆర్థిక కార్యదర్శిగా నాగేంద్రప్రసాద్, మండల కార్యదర్శిగా అన్నయ్యనాయక్ సంయుక్త సెక్రటరీగా ఓబులేసు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని తెలియజేశారు.

నిత్యపూజ కోన రోడ్డుకు మరమ్మతులు



దెబ్బతిన్న రహదారిని పరిశీలిస్తున్న ఎండోమెంట్ ఈవో శ్రీధర్

సిద్దవటం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి వర్షాలకు దెబ్బతిన్న నిత్యపూజేశ్వర కోన రహదారికి మరమ్మతులు చేయించామని ఇన్‌చార్జి ఈవో శ్రీధర్ తెలిపారు. కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా నిత్యపూజేశ్వరకోనలో ఉదయం 9 గంటల నుంచి శివపార్వతుల కల్యాణం జరుగుతుందని ప్రతిఒక్కరు స్వామివారి కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు., ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ దర్శనానికి వచ్చే భక్తుల వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రహదారికి మరమ్మతులు చేసి, మెరుగైన వసతులు కల్పించామని, పంచలింగాల గుడి వద్ద తాగునీటి గుండాలను శుభ్రం చేయించామన్నారు. దెబ్బతిన్న రహదారి పనులకు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుబ్రమణ్యంశర్మ, సిబ్బంది చంద్ర పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యం సృష్టిస్తున్న బైకుల సైలెన్సర్లు తొలగింపు



తొలగించిన సైలెన్సర్లతో పోలీసులు

రైల్వేకోడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న బైకులను స్వాధీనం చేసుకుని, నిబంధనలకు విరుద్ధంగా వాటికి అమర్చిన సైలెన్సర్లను తొలగించినట్లు రైల్వే కోడూరు ఎస్‌ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పలువురు యువకులు బుల్లెట్ బైక్‌లతో శబ్ద కాలుష్యం సృష్టిస్తున్నారంటూ ఫిర్యాదులు అందడంతో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించి పలు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అధిక శబ్దం చేసేందుకు ప్రత్యేకంగా వాటికి అమర్చిన సైలెన్సర్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకతాయి యువకుల్లో మార్పు తెచ్చేందుకు వీలుగా ప్రస్తుతం చర్యలు తీసుకున్నామని, వారిలో ఎలాంటి మార్పు కనిపించకుం టే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. యువకుల తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

రైల్వేకోడూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ ఆదివారం తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్య క్రమంలో ప్రజలు ఇస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. భూములు, సర్వేలు, పట్టాదారు పాసు పుస్తకాలు, గ్రామాల్లో మౌలిక సదుపాయలు, ఇంటి పట్టాలు, ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు కావాలని చాలా మంది వినతులు చేస్తున్నారని తెలిపారు. త్వరితగతిన సమస్యలను పరిష్కారం చేస్తున్నామని తెలిపారు.

నాగదేవతలకు పూజలు



నాగులకు పూజలు చేస్తున్న మహిళలు


పెనగలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నాగపంచమి సందర్భంగా ఆదివారం నాగిరెడ్డిపల్లె సమీపాన గల రంగమ్మచెరువు కట్టపై ఉన్న నాగ దేవతలకు ఆదివారం పి. కొతపల్లె, నాగిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన మహిళలు పూజలు చేశారు.చలిపిండి, నువ్వుల పిండి, మొలక సజ్జలు నైవేద్యంగా సమర్పించారు.

దక్షిణ భూకైలాసం.. బాలప్ప కోన



బాలప్పకోనలో కొలువైన పరమేశ్వరుడు, పార్వతీదేవి





పడవ ఆకారంలో ఉన్న బాలప్పకోన సముదాయం



సహజసిద్ధంగా దూకుతున్న గంగమ్మ

కొండాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రకృతి మనకు దేవుడిచ్చిన వరం. అలాంటి ప్రకృతిలో సాక్షాత్తు పరమేశ్వరుడు కొలువై ఉంటే ఇంకేముంది. తనివి తీరా చూడాలనిపిస్తుంది. ప్రకృతి అందాలతో పాటు దైవానుభూతిని కలిగించే విశిష్టమైన క్షేత్రం బాలప్పకోన. కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి ఉత్తర దిక్కున సుమారు 20కిలోమీటర్ల దూరంలో ఎర్రమలకొండల్లో బాలప్పకోన ఉంది. పడవ ఆకారంలో కొండ గుహల్లో పార్వతీపరమేశ్వరులు కొలువై దక్షిణ భూకైలాసంగా విరాజిల్లుతోంది. రాయలసీమ రత్న గర్భంలోని గొప్ప శైవక్షేత్రాల్లో బాలప్ప కోన (బాల మల్లేశ్వర కోన) ఒకటి. పరమేశ్వరుడు పార్వతీ సమేతంగా గంగను వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చినట్లు పురాణకథలు చెబుతున్నాయి. అందుకే ఈ క్షేత్రాన్ని దక్షిణభూకైలాసం అని పిలుస్తుంటారు. ఈ క్షేత్రంలో ఎప్పటి నుంచో మునీశ్వరులు నివాసమున్నట్లు అనేక కథలు ఉన్నాయి.

బాలప్ప కోన స్థలపురాణం

ఈ క్షేత్రం ఉన్న కొండలో పడవ ఆకారంలో గుహలున్నాయి. పడవలా ఉన్న పైభాగం నుంచి నీరు గలగల ప్రవహిస్తూ ఉంటుంది. లోయకు ఇరువైపులా ప్రకృతి సౌందర్యం రమణీయంగా ఉంటుంది. స్థలపురాణం ప్రకారం ఈ కొండకు పడవ ఆకారం రావడానికి కారణం.. భద్రుడు అనే మునీశ్వరుడు ఇక్కడ తపస్సు చేసుకుంటుండగా అతన్ని పరీక్షించడానికి శివపార్వతులు పదితలల పామును సృష్టించి విషాన్ని చిమ్ముతూ భద్రుని మింగేలా చేశారు. అపార శివభక్తుడైన భద్రుడు ఆ పాము భయంకర రూపాన్ని చూసినప్పటికీ, భయపడక శివనామస్మరణ చేయడంతో ఆ సర్పం మాయమై శివపార్వతులు దర్శనం ఇచ్చి భద్రునికి మోక్షాన్ని ప్రసాదించారని, అప్పటి నుండి భద్రుని పేర ఈ కొండ ప్రాంతం బాలప్పకోనగా విరాజిల్లుతోందని పురాణ గాథలు చెబుతున్నాయి.

బాలప్పకోన చేరుకోవాలంటే..

బాలప్పకోనకు తాళ్లప్రొద్దుటూరు వైపు నుంచి వచ్చేవారు బొందలదిన్నె, సంకేపల్లె మీదుగా, అలాగే తాడిపత్రి వైపు నుంచి వచ్చే వారు పెన్నా సిమెంటు ఫ్యాక్టరీ మీదుగా బాలప్పకోన చేరుకోవచ్చు.



బాలప్పకోనలోని కోనేరు

ప్రకృతి రమణీయంగా బాలప్ప కోన

అతి పురాతనమైన శివలింగం బాలప్పకోనలో కొలువై ఉంది. ప్రకృతి రమణీయంగా ఉన్న ఈ కొండల్లో గతంలో సుమారు 70 అడుగుల శివలింగం ఉండేదని స్థానికుల కథనం. గతంలో మునులు నిచ్చెనలు వేసుకొని పూజలు చేసేవారని, కాలక్రమేణా శివలింగం పూడిపోయి ప్రస్తుతం 5 అడుగులకు చేరుకుందని భక్తులు చెబుతున్నారు. ప్రకృతిసిద్ధంగా కొలువుదీరిన పరమేశ్వరుని దర్శించుకోవడానికి కార్తీకమాసంతో పాటు సోమవారం, వివిధ పర్వదినాల్లో అనేకమంది భక్తులు తరలివస్తారు. ముఖ్యంగా కార్తీకమాసంలో అఖండదీపారాదన చేస్తారు.

ఊరేగింపును ఉత్సాహంగా జరుపుకోండి

● రెచ్చగొట్టే పనులకు దిగొద్దు : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

చెన్నూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమ వారం సందర్భంగా చెన్నూరు నాగేశ్వర ఆల యం నుంచి నిర్వ హించే ఊరేగింపును ఉత్సాహంగా నిర్వహిం చుకోవాలని, ఎలాంటి రెచ్చగొట్టే పనులకు దిగొద్దని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అన్నారు. గత కొద్దిరోజులుగా ఈ ఊరేగింపు విషయమై రెండు వర్గాల మధ్య వాదోపవాదాలు జరుగుతున్న విషయంపై ఎస్పీ ఆదివారం సాయంత్రం చెన్నూరు రెవెన్యూ కార్యాలయానికి వచ్చారు. అక్కడ జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి ఇరువర్గాలతో మాట్లాడారు. పండు గలు, ఊరేగింపులు అన్ని మతాల్లో ఉంటాయని, అందరూ ఒకరికొకరు సహక రించుకోవాలన్నారు. ఏ రూటు ప్రకారం చెబుతామో అదే రూటులో ఎలాంటి శబ్ధ కాలుష్యమైన డ్రమ్స్ ఏర్పాటు చేయవద్దని, కేవలం మంగళ వాయిద్యాలతో నిర్వహించుకోవాలన్నారు. అదే సమయంలో ఊరేగింపునకు ఆటంకాలు కలి గించవద్దని తెలిపారు. పోలీసుపరంగా ఎలాంటి సంఘర్షణలు, సమస్యలు తలెత్తకుండా భద్రత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రకాశ్‌బాబు, ఆర్డీవో జాన్‌ఇర్విన్, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, బాలస్వామి రెడ్డి, సుధాకర్, అబ్దుల్‌కరీం, సీఐలు కృష్ణారెడ్డి, రోషన్, ఈదురుబాషా, తహసీల్దార్ సరస్వతి, ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

గాలివీడు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎగువ గొట్టివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.శివ, ఎస్.సనాకౌసర్ ఎంపికైనట్లు ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కడప మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఖోఖో అండర్-17 పోటీల్లో ఈ విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదాశివారెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించి రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ కనపర్చాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు...



ఎంపికైన గౌతమి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాండ్రపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని గౌతమి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ రెడ్డయ్య తెలిపారు. ఈ నెల 8న కడప మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు సిద్దేశ్వర, ఉపాధ్యాయులు చక్రపాణి హర్షం వ్యక్తం చేశారు.

13 లోగా దరఖాస్తు చేసుకోండి

సీకేదిన్నె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ఉపరవాణా కమిషనర్ ఎం.వీరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నైపుణ్యంతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థికసాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడమే దీని ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ చొప్పున మంజూరు చేసేందుకు నిర్ణయించడమైందన్నారు. ఈనెల 13 సాయంత్రం అయిదు గంటలలోపు ఆసక్తిగల అభ్యర్థులు డీపీఆర్ కాపీలను, ఇతర అటాచ్‌మెంట్లను ఉపరవాణా కార్యాలయం వైఎస్ఆర్ కడపజిల్లా ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందుకు కావాల్సిన అర్హతలు ఆసక్తిగల సంస్థ ఎంజీవో, ట్రస్ట్ , కోఆపరేటివ్ సొసైటీ, తయారీదారుడు, పార్ట్నర్షిప్ ఉండాలన్నారు. ఎన్జీవో అయితే తప్పనిసరిగా దర్పం పోర్టల్‌లో రిజిస్టర్ అయి ఉండాలన్నారు. ఈ సంస్థ గత మూడు సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్స్, టర్నోవర్ సర్టిఫికెట్లు అందించాలన్నారు. ఇటువంటి సంస్థకు సొంతంగా లేదా కనీసం పది సంవత్సరాల లీజు కలిగిన రెండు ఎకరాల స్థలం, సిమ్యులేటర్, ట్రైనింగ్ వాహనాలు, వర్క్‌షాపు, రెండు క్లాస్‌రూమ్స్, ఇంటర్నెట్, తదితర సదుపాయాలు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు రవాణా శాఖ వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు.

ద్విచక్రవాహనం ఢీ... ఒకరి మృతి



మృతి చెందిన కొండయ్యనాయుడు

రాయచోటి-నేతాజీసర్కిల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి సంబేపల్లె మండలం మొటుకువాండ్లపల్లె సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అతని భార్యకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... సుండుపల్లె మండలం రామవాండ్లపల్లెకు చెందిన కొండయ్య నాయుడు (51) రత్నమ్మ దంపతులు ద్విచక్రవాహనంలో అన్నప్పగారిపల్లెకు వెళుతుండగా మొతుకువాండ్లపల్లె క్రాస్ వద్ద పీలేరు వైపు వెళుతున్న కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన కొండయ్యనాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, రత్నమ్మ తీవ్రంగా గాయపడింది. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన మహిళను తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలియజేశారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి



ఎర్రగుంట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వృద్ధుడు ఆదివారం మృతి చెందినట్లు ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు. గత నెల 13వ తేదీన ముద్దనూరు రోడ్డులోని సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో వున్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

వాహనం ఢీకొని ఇద్దరు యువకులు మృతి



మృతి చెందిన యువకులు

మైదుకూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవీ సత్రం కూడలి సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. యువకులు కడప పట్టణం బెల్లంమండి వీధికి చెందిన సాయిసంజయ్(22), చిన్నచౌకు అశోక్‌నగర్‌కు చెందిన సంతోష్(23)లుగా గుర్తించారు. సాయి బంగారుషాపులో పనిచేస్తుండగా సంతోష్ కడప అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదువుతున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హార్సిలీహిల్స్‌లో ట్రైనీ కలెక్టర్లు



హార్సిలీహిల్స్‌కు వచ్చిన ట్రైనీ కలెక్టర్లు

బి.కొత్తకోట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన హార్సిలీ హిల్స్‌లో ఆదివారం ట్రైనీ కలెక్టర్లు కలియ తిరిగారు. 2024-25 బ్యాచ్‌లో ఐఏఎస్ పూర్తి చేసి ఎంపికైన వారు విధుల్లో తర్ఫీదు పొందే కార్యక్రమంలో భాగంగా మదనపల్లి సబ్ కలెక్టర్ రాయచోటి కలెక్టర్ కార్యాలయాలకు అటాచ్ అయ్యారు. వీరిలో ఆరుగురు మదనపల్లి, మరో ఆరుగురు రాయచోటి పరిధిలో ట్రైనింగ్ చేస్తున్నారు. మధ్యప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాలకు చెందిన 9 మంది, తెలంగాణకు చెందిన ముగ్గురు వున్నారు. ఈ ట్రైనీ కలెక్టర్లు అందరూ ఆదివారం హార్సిలీహిల్స్‌కు వచ్చారు. మదనపల్లి సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ప్రొటోకాల్ ఏర్పాటు చేశారు. ఆర్ఐ వీరాంజనేయులు హిల్స్‌లోని గవర్నర్ బంగ్లాలో విడిది ఏర్పాటు చేసి హిల్స్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్లు మాట్లాడుతూ హార్సిలీ హిల్స్‌లోని వాతావరణం ఎంతగానో ఆకట్టుకుందని వారు అన్నారు.

నేడు కురబలకోటలో ట్రైనీ కలెక్టర్ల పర్యటన

కురబలకోట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరుగురు ట్రైనీ కలెక్టర్లు సోమవారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య, ఇన్‌చార్జ్ తహసీల్దార్ తపస్విని పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె డివిజన్ పరిధిలో ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించి పనులను పరిశీలనకు వచ్చిన వారిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కనసానివారిపల్లె పంచాయతీలో జరిగే రీసర్వే పనులను పరిశీలిస్తారన్నారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



61 పరుగులు చేసిన తాహిర్ (కడప), 102 పరుగులు చేసిన మణిదీప్ (చిత్తూరు)

కడప స్పోర్ట్స్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ సౌత్‌జోన్ అండర్-14 మెన్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారం డ్రాగా ముగిశాయి. నగర శివారులోని రిమ్స్ సమీపంలో ఉన్న వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 66.2 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 54 పరుగులు చేసింది. కాగా 54 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండవ రోజైన ఆదివారం తిరిగి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 71.5 ఓవర్లలో మొత్తం 147 పరుగులకే చేతులెత్తేసింది. దీంతో కడప జట్టుకు 51 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. బౌలింగ్ విభాగంలో కడపకు చెందిన బౌలర్ భానువర్షిత్‌రెడ్డి 6 వికెట్లు సాధించి కట్టడి చేశారు. రెండో ఇన్నింగ్స్‌లో కడప జట్టు ఆట ముగిసే సమయానికి 46 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసింది. ఇందులో తాహిర్ 61 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కేఓఆర్ఎం మైదానంలో

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 28.3 ఓవర్లలో 63 పరుగులకు కుప్పకూలిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు సైతం 34.3 ఓవర్లలోనే కేవలం 56 పరుగులు చేసి ఆలౌట్ అయింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ 78 పరుగులతో ఆదివారం తిరిగి రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు 81.2 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 289 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో మునిదీప్ 102 పరుగులు చేసి నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో చిత్తూరు జట్టు రెండు ఇన్నింగ్స్‌లకు గాను 296 పరుగులు సాధించింది. కాగా ఇందుకు ప్రతిగా రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 32 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. ఇందులో మోక్షజ్ఞరెడ్డి 63 పరుగులు చేయగా మరో బ్యాటర్ షాకిత్ 60 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైన కన్నెమడుగు విద్యార్థులు

తంబళ్లపల్లె, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు కన్నెమడుగు హైస్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌బాష తెలిపారు. సెప్టెంబరులో కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కన్నెమడుగు హైస్కూలులో 9వ తరగతి చదువుతున్న రిషిత, ప్రియ ప్రవల్లిక సత్తా చాటి రాష్ట్ర జట్టులో స్థానం సంపాదించినట్లు తెలిపారు. ఈ విద్యార్థులు ఈ నెలలో 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఘజియాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ తరఫున పాల్గొంటారని షూటింగ్‌బాల్ రాష్ట్ర కార్యదర్శి పరశురాం, జిల్లా షూటింగ్‌బాల్ కన్వీనర్ నరేష్‌కుమార్ పేర్కొన్నారని పీడీ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్ఎం మదన్‌మోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

● వడ్డీ వ్యాపారి రవిపై హత్య కేసు నమోదు

మదనపల్లె అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారి చేతులో గాయపడి చికిత్స పొందుతున్న శ్రీనివాసులు (47) ఆదివారం తిరుపతిలో మృతి చెందాడు. తాలుకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె మండలం, కొండామరిపల్లె గ్రామం, ఇసునూతనపల్లెకు చెందిన శ్రీనివాసులు అతని భార్య ప్రభావతికి అదే గ్రామానికి చెందిన రవితో వడ్డీలావాదేవీలు ఉండేవి. గత నెల 30వ తేదీన రవి శ్రీనివాసులు ఇంటికి వెళ్లి వడ్డీ విషయమై అతని భార్య ప్రభావతిని దర్భాషలాడాడని, ఆమె మనస్తాపం చెంది క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరుసటి రోజు శ్రీనివాసులు రవి ఇంటి వద్దకు వెళ్లి ఈ విషయమై అడగగా శ్రీనివాసులను కర్రతో తలపై కొట్టి గాయపర్చాడు. స్థానికులు వెంటనే శ్రీనివాసులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు తిరుపతి రూయాకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం శ్రీనివాసులు మృతిచెంది నట్లు పోలీసులు తెలిపారు. సోమవారం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో శవ పరీక్షలు నిర్వహించి కుటుంబ సభ్యులు అప్పజెప్పనున్నారు. రవిపై తాలుకా సీఐ హత్య కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఇరు వర్గాల ఘర్షణ

● కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, సరస్వతినగర్‌కు చెందిన ఇరువురు ఘర్షణ పడడంతో తాలుకా పోలీసులు ఒకరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ కళావెంకటరమణ పేర్కొన్నారు. పోలీసుల వివరాలిలా.. మండలంలోని సరస్వతీనగర్ వాసి రామూర్తి నాయక్‌కు, అదే ప్రాంతానికి చెందిన భవానీతో పాత గొడవలు ఉండేవి. అయితే అప్పట్లో రాజీపడి రూ.40 వేలు రామ్మూర్తినాయక్ చెల్లించారు. ఆదివారం సాయంత్రం రోడ్డుపై భవానీ, అతని భార్య నడుచుకుంటూ వెళుతుండగా రామ్మూర్తినాయక్‌కు ఎదురుగా వచ్చి దుర్భాషలాడారు. ఈ మేరకు భవానీపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మహిళకు గాయాలు

ములకలచెరువు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముంబై-చెన్నై జాతీయ రహదారిలో ఆదివారం రాత్రి రోడ్డు దాటుతున్న ఓ మహిళను ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళతో పాటు ద్విచక్రవాహనదారులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... మండలంలోని వేపూరికోట పెట్రోల్ బంకు ఎదురుగా రోడ్డు దాటుతున్న మావిళ్లవారిపల్లెకు చెందిన మహిళ సుజాతను కదిరి వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. అనంతపురానికి చెందిన ద్విచక్రవాహనదారులు ప్రశాంత్, సింహాద్రి కూడా తీవ్రంగా గాయపడ్డారు. ముగ్గురు పరిస్థితి విషమంగా ఉండడంతో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

శివోహం

సూర్యకిరణాభిషిక్తుడు కాశీ విశ్వేశ్వరుడు
ప్రకృతి ఒడిలో సేదతీరుతున్న మద్దుండాల మల్లేశ్వరుడు
శ్రీశైలం తరహాలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం


ప్రత్యేక అలంకరణలో కాశీవిశ్వేశ్వరుడు (పీలేరు)

పీలేరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మరో వారం రోజుల్లో ముగిసి పోతోంది. శివయ్య ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. భక్తుల కొంగు బంగారం, భోళాశంకరుడు, భూతనాథుడు, వీరభద్రుడు, లయకారుడు అయిన శివయ్య వివిధ నామాలతో పీలేరు నియోజకవర్గంలో కొలువై ఉన్నాడు. పీలేరులోని కాశీవిశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, శివరామాపురంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం, జంగంపల్లెలోని వీరభద్ర స్వామి ఆలయం, అడవిపల్లెలోని మద్దుండాల మల్లేశ్వర స్వామి ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి.

సూర్యకిరణాభిషిక్తుడు...

స్థానిక బ్రాహ్మణ వీధిలోని కాశీవిశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అత్యంత పురాతన ఆలయాల్లో ఒకటి. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో నిర్మింపబడినట్లు స్థల పురాణం చెబుతున్న ఈ ఆలయంలోని శివలింగానికి ప్రతి మాఘమాసంలో సూర్యకిరణాలు అభిషేకం చేస్తుంటాయి. కార్తీక సోమవారాల్లో శివయ్యకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, దీపారాధన, కేదారగౌరీ వ్రతం జరిగాయి. ఆలయ ప్రాంగణలోని సుమారు 150 ఏళ్లుగా భక్తులతో పూజలందుకుంటున్న వేప, రావి చెట్లకు భక్తులు విశేష పూజలు చేస్తున్నారని అర్చకులు విరూపాక్షం కుమారస్వామి తెలిపారు.

శ్రీశైలం తరహాలో....

దొడ్డిపల్లె పంచాయతీలోని శివరామాపురంలో వెలసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం శ్రీశైలంలోని ఆలయాన్ని జ్ఞప్తికి తెస్తుంది. శ్రీశైలం వెళ్లి శివపార్వతులను దర్శించుకోలేని వారి కోసం పల్లవులు ఈ ఆలయాన్ని నిర్మించారని ఆలయంలోని గోడలపై ఉన్న పురాతన శాసనాల ద్వారా తెలుస్తోంది. గార్గేయ నది ఒడ్డున ఈ ఆలయంలో ప్రతి కార్తీక మాసంలో హిమాలయాల నుంచి కొంత మంది సాధువులు వచ్చి ప్రత్యేక పూజలు చేసేవారని అర్చకులు తెలిపారు. ఈ ఆలయంలో కూడా వేప, రావి చెట్లు ఉండడంతో కార్తీక మాసంలో భక్తులు దర్శించుకున్నారు.


విద్యుత్ దీప కాంతుల్లో కలికిరి సోమేశ్వరాలయం

జంగంపల్లెలో వీరభద్రుడు...

వేపులబైలు పంచాయతీ జంగంపల్లెలో వెలసిన వీరభద్ర స్వామి ఆలయంలో కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు విశేషంగా జరిగాయి. ఈ ఆలయంలో జమ్మి చెట్టు ఉండడంతో పీలేరు సహా పరిసర ప్రాంతాల్లోని భక్తులు వీరభద్రుడిని పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

ప్రకృతి ఒడిలో సేదతీరుతున్న మద్దుండాల మల్లేశ్వరుడు

అడవిపల్లె వద్దనున్న అటవీ ప్రాంతంలో వెలసిన మద్దుండాల మల్లేశ్వరుడు సంతానలేమితో బాధపడే వారికి సంతానాన్ని ఒసగే కల్పతరువుగా విరాజిల్లుతున్నాడు. అటవీ ప్రాంతంలోని ప్రకృతి అందాల మధ్య సేద తీరే మల్లేశ్వరుడి ఆలయంలో కార్తీక మాసంలో భక్తులు పోటెత్తారు.

వాల్మీకిపురంలో....

వాల్మీకిపురం సమీపంలోని వీరభద్రాద్రి (వీరన్న కొండ), కోనేటి వీధిలోని లక్ష్మీ కామేశ్వర స్వామి దేవాలయం, పట్టణ పడమర పొలిమేరలోని ధర్మపథం ఆలయం, ఏటిగడ్డ శివాలయం, చింతపర్తిలోని ఓబులేశ్వర స్వామి ఆలయం ప్రసిద్ధమైనవి. కార్తీక మాసంలో అశేష భక్తులు పోటెత్తారు.

గుర్రంకొండలో....

గుర్రంకొండలో సిద్దేశ్వర ఆలయం, ప్యారంపల్లె మహేశ్వర ఆలయం, బురుజుపల్లె ఉమామహేశ్వర ఆలయం, సరిమడుగు మల్లికార్జున స్వామి ఆలయాల్లో కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

కలికిరిలో....

పట్టణంలోని పురాతనమైన సోమేశ్వరస్వామి ఆలయం, గుట్టపాలెం పంచాయతీ పూలకొండలో వెలసిన భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయాల్లో కార్తీక మాసంలో మహాశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.


ప్రత్యేక అలంకణలో లక్ష్మీకామేశ్వరస్వామి (వాల్మీకిపురం)

కలకడలో....

జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాల్లో కలకడ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయం ఎంతో పురాతనమైనది. ఈ ఆలయంలో కార్తీక మాసంతోపాటు మహాశివరాత్రి పర్వదినాన స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడానికి పలు జిల్లాల నుంచి భక్తులు తరలి వస్తారు. ఈ ఏడాది కూడా అశేష భక్తవాహిని స్వామి వారిని దర్శించుకున్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో మిట్స్ విద్యార్థుల ప్రతిభ

● కాగ్నిజెంట్‌కు 182మంది విద్యార్థులు ఎంపిక


క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

కురబలకోట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అంగళ్లు సమీపంలోని డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీ విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ కనబరిచారు. కళాశాలలో కాగ్నిజెంట్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 182మంది విద్యార్థులు ఎంపికైనట్లు వీసీ యువరాజ్ ఆదివారం తెలిపారు. కళాశాలలో కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూ చేశారు. విద్యార్థులకు రాతపరీక్ష, గ్రూప్ డిష్కషన్, హెచ్‌ఆర్ తదితర రౌండ్లను నిర్వహించారు. ఇంటర్వ్యూలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఫైనలియర్ సీఎస్ఈకి చెందిన 72మంది, సీఎస్‌టీకి చెందిన 35, సీఏఐకి చెందిన 38మంది, సైబర్‌సెక్యూరిటీకి చెందిన 9మంది, డేటా సైన్స్‌కు చెందిన 13మంది, ఈసీఈకి చెందిన 11మంది, ఈఈఈకి చెందిన ఇద్దరు, ఎంటెక్ సీఎస్ఈకి చెందిన ఇద్దరు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు కంపెనీ నియామక ధృవపత్రాలను అందజేశారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.6.75లక్షలు, 5.5 లక్షల వేతనాన్ని ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను చాన్సెలర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ప్రోచాన్సెలర్ ద్వారకనాథ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల వీసీ యువరాజ్ తదితరులు అభినందించారు.

రెంటికీ చెడ్డ రేవడి

● అప్‌గ్రేడ్ చేశారు - సదుపాయాలు మరిచారు
● ఎక్స్‌రే..స్కానింగ్ సౌకర్యం నిల్
● సబ్‌సెంటర్ సిబ్బంది పక్కమండలానికి వెళ్లాల్సిందే
● ఇదీ సీహెచ్‌సీ దుస్థితి



బి.కొత్తకోట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా వున్న బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రిని ప్రజల సౌకర్యార్థం సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేశారు. పట్టణ జనాభాతో పాటు పొరుగున ఉన్న పీటీఎం, ములకలచెరువు మండలాలు, కర్ణాటక నుంచి కూడా బి.కొత్తకోటకు వైద్యం కోసం వస్తుంటారు. ప్రతి చిన్న సమస్యకూ మదనపల్లెకు రెఫర్ చేయకుండా ఇక్కడే మెరుగైన వైద్యం అందేలా 30పడకలతో కమ్యూనిటీహెల్త్ సెంటర్‌ను టీడీపీ హయాంలో ఏర్పాటు చేశారు. రూ.3.80కోట్లతో చక్కటి భవనాన్ని నిర్మించగా అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ 2017లో సీహెసీని నూతన భవనంలో ప్రారంభించారు. దీంతో మదనపల్లికి వెళ్లాల్సిన అవసరం లేకుండా వైద్యసదుపాయం వుంటుందని అందరూ ఆశించారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో దీనిపై దృష్టి పెట్టకపోవడంతో స్థాయికి తగ్గ వైద్యం అందడం లేదు. అనేక సమస్యలు అలానే వుండి పోయాయి.

> **ఉన్నంతలో మెరుగైన వైద్యం...**
>
> బి.కొత్తకోట సామాజిక ఆరోగ్యకేంద్రంలో కొంత సిబ్బంది కొరత, మిషనరీ సమస్య ఉన్నమాట వాస్తవమే. రోజుకు 500దాకా ఓపీ న మోదవుతున్నా అందుబాటులో ఉన్న సిబ్బందితో వైద్యం అందిస్తున్నాం. సర్జరీలు కూడా చేస్తున్నాం. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు తీరితే ప్రజలకు ఇంకా మెరుగైన వైద్యం అందుతుంది
>
> - డాక్టర్‌కిరణ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్, బి.కొత్తకోట సీహెచ్‌సీ

స్థాయికి తగ్గ సదుపాయాలు ఏవీ?

బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రిలో రోజూ 400కు పైగా ఓపీ నమోదవుతోంది. వివిధ సమస్యలతో ఆసుపత్రికి వచ్చే వారికి తగిన వైద్యం అందేలా సదుపాయాలు, తగిన సిబ్బంది లేక పోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. జనరల్ ఫిజీషియన్ సహా ఇద్దరు వైద్యులు, కొంత సిబ్బంది ఖాళీలు వుండడంతో వున్న వారిపై భారం పడుతోంది. ఎక్స్‌రేమిషన్, స్కానింగ్ లేకపోవడంతో గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. పోస్టుమార్టం కోసం సిబ్బంది వున్నా, గది నిర్మాణం లేకపోవడంతో ఆ తంతుకు మదనపల్లెకు వెళ్లాల్సి వస్తోంది. సీహెచ్‌సీ స్థాయి వైద్యం అంటే ఈఎన్‌టీ, ఎముకలు, పీడియాట్రిక్, గైనకాలజిస్ట్, డెంటల్ తదితర విభాగాల డాక్టర్లు, సర్జన్‌లు వుండి వైద్యం అందించాలి. తగిన సిబ్బంది, సదుపాయాల కొరతతో వైద్యం కుంటుపడుతోంది.

సిబ్బంది పక్క మండలానికి

బి.కొత్తకోట పీహెచ్‌సీ స్థాయి పెరిగి సీహెచ్‌సీగా మారడంతో మండల పరిధిలోని ఆరోగ్యఉపకేంద్రాలను పొరుగు మండలమైన పీటీఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోకి చేర్చారు. దీం తో ఏఎన్ఎంలు, ఆశావ ర్కర్ల బాధలు వర్ణనాతీతం గా మారాయి. మండలం లోని తుమ్మణంగుట్ట, కోటా వూరు, మొటుకు లాంటి గ్రామాల నుంచి పీటియం మండలంలోని పీహెచ్‌సీకి వెళ్లి అక్కడి మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పనిచేయాల్సి వస్తోంది. చిన్నారులు, గర్భిణులకు వేయాల్సిన వ్యాక్సిన్‌ను 40కి.మీ లు ప్రయాణించి పీటీఎంకు వెళ్లి తీసుకుని గ్రామాలకు తిరిగి ప్రయాణించి వైద్య సేవలు అందించాల్సి వస్తోంది. బి.కొత్తకోట మండలంలోనే మరో పీహెచ్‌సీ ని ఏర్పాటు చేయాలంటూ ఏళ్ల తరబడి మొత్తుకుంటున్నా ఫలితం లేకుండా పోతోందని వైద్యసిబ్బంది వాపోతున్నారు.


ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న సర్జికల్ వార్డు

శ్రీకృష్ణదేవరాయలు జిల్లాగా చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మునిగోపాల్‌కృష్ణ

మదనపల్లె అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లెను శ్రీకృష్ణదేవరాయలు జిల్లాగా నామకరణం చేయాలని ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మునిగోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జీఆర్టీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశాన్ని పరిపాలించిన గొప్పచక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు పేరిట జిల్లా లేకపోవడం దారుణమన్నారు. 150 వసంతాలు పూర్తి చేసుకుని స్ఫూర్తిగా నిలిచిన వందేమాతరం గీతాన్ని సీనియర్ సిటిజన్స్ ఆలపించారు. ఈ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాల్‌కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ మోహన్, చంద్రశేఖర్, టీఎస్ఏ కృష్ణమూర్తి, మహిళా ప్రతినిధి సరస్వతి, ముఖ్యఅతిథిగా పాల్గొన్న మదనపల్లె డివిజన్ విశ్రాంతి ఆర్మీఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు వందేమాతం విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో ధనలక్ష్మీ, ప్రేమ, సరస్వతి, శారద, జయమ్మ, ప్రసన్న లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం


కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి శివపార్వతుల కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం రోజున శివపార్వతుల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఆదివారం సాయంత్రం ఆలయంలో స్వామి వారి ఉత్సవ మూర్తులను అలంకరించి స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం చేశారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి పవన్‌కు ఆహ్వానం


పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానిస్తున్న ఏఎంసీ చైర్మన్ జంగాల శివరామ్

మదనపల్లె, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని చైర్మన్ జంగాల శివరామ్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను ఆహ్వానించారు. పలమనేరు సమీపంలోని ముసలిమడుగు అటవీ ప్రాంతంలో కుంకి ఏనుగుల శిక్షణకు విచ్చేసిన ఆయనను కలిసి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ గజ్జల రెడ్డెప్ప, పట్టణ కార్యదర్శి మేకల చెరువు అర్జున, ప్రధాన కార్యదర్శి జవిలి మోహన్ కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెజబ్బు బాధితుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వమిత్రులు

మదనపల్లె అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పుట్టుక నుంచీ గుండెజబ్బుతో బాధపడుతున్న వజ్రధర్‌కు సొరకాయల శ్రీనివాసులు, సెంజి సురేశ్ బాబు, శ్రీనివాసులు ఆర్థిక సాయం చేశారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో 2004-2005లో తమతో పాటు బీఎడ్ చేసిన మిత్రుడు తాడిపత్రిలో నివాసం ఉంటున్న అవ్వారి శ్రీనివాసులు కుమారుడు వజ్రధర్ పుట్టినప్పటి నుంచీ గుండెజబ్బుతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న నాటిమిత్రులు సొరకాయల శ్రీనివాసులు తన మిత్రులతో మాట్లాడి రూ.1,06000 నగదు ఆర్థికసాయం చేశారు. అవ్వారి శ్రీనివాసులు మాట్లాడుతూ కష్టకాలంలో మిత్రులు సహకరించడం మరువలేదని, చాలా సంతోషంగా ఉందన్నారు.

మదనపల్లెలో వెల్లి విరిసిన మతసామరస్యం

● 11 ఏళ్లుగా అయ్యప్పలకు భిక్ష కార్యక్రమం


అయ్యప్ప మాలధారులకు భిక్ష పెడుతున్న అబుబాకర్ సిద్దిక్

మదనపల్లె అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): హెల్పింగ్ మైండ్స్ సంస్థ నిర్వహకుడు అబుబాకర్ సిద్దిక్ అయప్ప మాలధారులకు భిక్ష నిర్వహించడంతో మదనపల్లెలో మత సామరస్యం వెల్లివిరిసింది. 11ఏళ్లగా అన్ని సేవా కార్యక్రమాలను సేవాసంస్థ ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం పట్టణంలోని జ్ఞానోదయ పాఠశాలలో అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు ఖాదర్‌ఖాన్, సునీల్, హనీఫ్, సమీర్, కమ్మల, ఆనంద్, నవీన్, సాయిదీపక్, రాహుల్, అమీన్, సైనవలి, ఉమర్, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేల చూపుల్లో సోలార్ సిగ్నల్ లైట్..!



కలకడ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై సత్యవతి నది వద్ద వున్న సోలార్ సిగ్నల్ లైట్ నేల చూపులు చూస్తోంది. సమీపంలో బ్రిడ్జికి సూచికగా దూరం నుంచే వాహనదారులను అప్రమత్త పరిచేలా నేషనల్ హైవే అధికారులు దీన్ని ఏర్పాటు చేశారు. ప్రసుత్తం స్తంభం వరిగి కాంతులు కిందికి ప్రసరిస్తున్నాయి. దీంతో ప్రయాణీకులకు హెచ్చరిక కనబడక ప్రమాదాలు జరిగే అవకాశం వుంది. అధికారులు స్పదించి మరమ్మతులు చేయిచాలి.

మండల టీడీపీ అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి


దామోదర్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నల్లారి

వాల్మీకిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ నూతన అధ్యక్షుడిగా మండలంలోని అయ్యవారిపల్లె వాసి కంభం దామోదర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆదివారం నగిరిపల్లెలో మండల నేతల సమక్షంలో సమావేశం నిర్వహించి మండల పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం దామోదర్ రెడ్డిని అభినందిస్తూ మండల పార్టీ నేతలు, కార్యకర్తలను కలిపి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా కంభం దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల పార్టీ అధ్యక్షుడి పదవి ఇచ్చినందుకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డికి, నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

బంజార సేవా సంఘం జిల్లా కమిటీ ప్రమాణం

మదనపల్లె అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా కమిటీ ప్రమాణ స్వీకారం సుగాలిమిట్టలో ఆదివారం నిర్వహించారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల, టౌన్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బి.నాగూనాయక్, ప్రధాన కార్యదర్శిగా శంకర్ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రెడ్డి నాయక్, జిల్లాయువజన అధ్యక్షుడిగా మనోజ్ కుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్ నాయక్, పట్టణ అధ్యక్షుడిగా చిన్ని నాయక్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా శైలజ, జనరల్ సెక్రటరీగా రమేశ్ నాయక్ ప్రమాణం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు బాణావత్ చక్రి నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థికంగా, రాజకీయంగా విద్య పరంగా పూర్తి సహకారం అందివ్వాలని, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి టావత్ రాంబాబు నాయక్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు చౌహాన్, రాష్ట్ర నేతలు వెంకటరమణ నాయక్, రామచంద్ర నాయక్, నేతలు నాగరాజ నాయక్, పవన్ కుమార్‌నాయక్, బాలాజీ నాయక్, రజిని నాయక్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష కార్తీక దీపోత్సవం



మదనపల్లె అర్బన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం, మదనపల్లె వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నెహ్రూబజార్‌లో కార్తీక లక్షదీపోత్సవం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ముగ్గులు వేసి నెయ్యి ఒత్తులతో దీపారాధన చేశారు. ఇందులో శివుడిని ఏర్పాటు చేసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం శివలిగాల ఆలకారంలో ధీపారాధన చేశారు. ఇవి ప్రత్యేక అలంకరణగా నిలిచాయి.కార్తీక దీపోత్సం శోభ నెలకొంది.

వేడుకగా సత్యదేవుడి వ్రతం

పీలేరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం సామూహిక రమా సహిత సత్యన్నారాయణ స్వామి వ్రతం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. కార్తీక మాసం సందర్భంగా వీ211ఏ పీలేరు వాసవీ క్లబ్ గ్రేటర్, వాసవీ కపుల్స్ క్లబ్, ఆర్యవైశ్య సంఘం సంయుక్తంగా ఈ వ్రతం నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ వేడుకల్లో 40 జంటలు పాల్గొన్నాయి.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

వాల్మీకిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా నిరుపేద కుటుంబానికి తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం నగిరిపల్లెలో సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని 12మందికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన రూ.10లక్షల మేరకు చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నేత కంభం నిరంజన్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఏజీపీ

వాల్మీకిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జూనియర్ సివిల్ కోర్టులో ఏజీపీగా నియమితులైన రమణ ఆదివారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని కలిశారు. తనకు ఏజీపీగా రావడం పట్ల సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు కువైట్‌బాబు, డిష్‌బ్రదర్స్, టీడీపీ బీసీ నాయకురాలు స్వర్ణలత పాల్గొన్నారు.

ఘనంగా ఉర్దూ దినోత్సవం

వాల్మీకిపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సాహితీ ప్రపంచంలో ధృవతార విశ్వకవి అల్లామా ఇక్బాల్ అని టీడీపీ మాజీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. సారేజహాసే అచ్ఛా గేయ రచయిత ఇక్బాల్ జయంతి పురస్కరించుకుని వాల్మీకిపురం నాయక్‌వీధిలో ఆదివారం ఉర్దూ దినోత్సవం చేసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నేతలు జవాద్‌హుస్సేన్, నేతలు సయ్యద్‌బాషా, మొహ్మద్, ఆనంద, మెకానిక్ చాను, గౌస్‌పీర్, ఆబిద్‌హుస్సేన్, ఉర్దూ సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

ఐబీటీ విద్యార్థుల ప్రతిభ

పీలేరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చిల్డ్రన్స్ డే సందర్భంగా పీలేరు లయన్స్ క్లబ్ నిర్వహించిన వక్తృత్వ, వ్యాస రచన పోటీల్లో ఇండియన్ బీచ్ ట్రీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాల విద్యార్థులు క్విజ్ పోటీల్లో మూడో బహుమతి, వ్యాస రచనలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలను ప్రిన్సిపాల్ భార్గవి, కరస్పాండెంట్ సుదర్శన్ నాయుడు అభినందించారు.